క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

2న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో మార్చి 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

వినూత్నంగా బాబా పూజలు



బాబాపై బియ్యం పోస్తున్న భక్తుడు

అల్లిపురం: సౌత్ జైలురోడ్డులోని వివేకానందకాలనీలో గల సాయి దర్బార్‌లో మంగళవారం నుంచి గురువారం వరకు బాబా పాదుకలపై బియ్యం రాశి పోసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసశాస్త్రి తెలిపారు. గురువారం వరకు నమ్మకం కలిగిన భక్తులు వచ్చి బాబాకు బియ్యం సమర్పించవచ్చని తెలిపారు. తొలి రోజు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి బాబా పాదుకలపై బియ్యం పోసి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ బాబాకు బియ్యం సమర్పించిన అనంతరం బియ్యం రాశిపై దీపం వెలిగిస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్

డాబాగార్డెన్స్: నిరంతరం విశాఖ అభివృద్ధితో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలందరం రుణపడి ఉంటామని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమిట్–2023 విశాఖలో నిర్వహించనున్నారని, అదే విధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని విశాఖ తీసుకొచ్చి 11 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించారన్నారు. సమావేశంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతో సమాజాభివృద్ధి

అల్లిపురం: విద్యార్థి దశ నుంచే సేవ చేయడం అలవర్చుకోవడం ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడవచ్చని పీడీజీఆర్ టీఎస్ ఛాయాదేవి పేర్కొన్నారు. రోటో ట్రాక్ట్ క్లబ్ ఆఫ్ వైజాగ్ కపుల్స్, సన్ ఇంటర్నేషనల్, రోటోట్రాక్ట్ క్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రిజమ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నగరంలోని ఒక హోటల్లో నిర్వహించిన 'సేవా మార్గంలో విద్యార్థులకు మార్గదర్శకం' అనే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథి ప్రత్యూషవర్మ మాట్లాడుతూ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ఆసక్తి చూపించాలన్నారు. కార్యక్రమంలో రోటోట్రాక్ట్ చైర్ పర్సన్ ఆశాజాస్తి, చైర్మన్ ఆర్‌టీఎస్ సత్యనారాయణ రెడ్డి, అధ్యక్షుడు ఆర్. శుభోధ్‌కుమార్, సెక్రటరీ వి.ఉషామాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి 'పొగ'

- జ్ఞానాపురం.. కంచరపాలెం ప్రాంతాల్లో వైర్లు, టైర్లు, ఆయిల్ ఫిల్టర్లు కాలుస్తున్న అల్లరిమూకలు
- దుర్గంధం.. శ్వాసకోశ వ్యాధులతో స్థానికుల సతమతం



జ్ఞానాపురం ఎర్రిగెడ్డలో ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లు తగులబెడుతున్న దృశ్యం



కంచరపాలెం ఫ్లైఓవర్ రహదారిలో ఎగసిపడుతున్న పొగ

కంచరపాలెం: కంచరపాలెంలోని భారతీయ ఆహార గిడ్డంగి సంస్థ రహదారి నుంచి రామ్మూర్తిపంతులుపేట రైల్వేగేటుకు వెళ్లే రహదారి వరకు మధ్యలో అనేక స్క్రాప్ దుకాణాలు ఉన్నాయి. ఇక్కడున్న వాహనాల మరమ్మతుల దుకాణాలతో రహదారులు కాలుష్యంతో నిండిపోతున్నాయి. ఇక్కడ వ్యర్థ పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో దహనం చేయడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలుతున్న వ్యర్థాల నుంచి దుర్గంధం వెలువడుతుండడంతో వాసన భరించలేక శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. దట్టమైన పొగ వెలువడడంతో స్థానికులతో పాటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నేతాజీ ఫ్లైఓవర్ నుంచి జ్ఞానాపురానికి వెళ్లే లారీ యార్డు, ఎర్రిగెడ్డ సమీపంలో హరితవనం ప్రాంతంలో నిత్యం బయటి ప్రాంతాల నుంచి తెచ్చిన చెత్తా చెదారాలను కుప్పలుగా పోగులు పెడుతున్నారు.

దీంతో ఇక్కడి ప్రాంతాలు డంపింగ్‌యార్డ్‌లుగా మారిపోతున్నాయి. పైడిమాంబ ఆలయం రహదారిలో లారీల మరమ్మతులకు చెందిన సిబ్బంది ఇంజన్లకు సంబంధించిన వ్యర్థాలను మంట పెడుతున్నారు. చిల్లర దొంగతనాలు చేసే అల్లరిమూకలు ఎక్కడి నుండో తస్కరించి తెచ్చిన విద్యుత్, కేబుల్ వైర్లు ఇక్కడే కాలుస్తున్నారు. దీంతో కార్బన్ మోనాక్సైడ్, ఇతర కాలుష్య వాయువులు వెలువడుతున్నాయి. గతంలో అనేక పర్యాయాలు ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యర్థ పదార్థాలను కాలుస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాలుష్యంతో నిండిన పొగ చుట్టుపక్కల వ్యాపించి వంతెన రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్–5 పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

వ్యర్థాలకు నిప్పు పెట్టేవారిపై ఫిర్యాదులు రాలేదు. అయినప్పటికీ ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యను గుర్తించేలా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశిస్తాం. సమస్య పరిష్కారానికి తప్పకుండా తగు చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ రాజేష్, ఏఎంహెచ్‌వో, పబ్లిక్‌హెల్త్, జోన్–5, జ్ఞానాపురం

సీవీ రామన్ సేవలకు గుర్తింపే జాతీయ సైన్స్ దినం



సోలార్‌తో పనిచేసే చెస్ మోటార్‌ను తిలకిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం



ఏవీఎన్ కాలేజీలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న అతిథులు

అల్లిపురం: ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సీవీ రామన్ మొదటి వారని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం అన్నారు. రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తింపుగా ఆయన గౌరవార్థం ప్రతి ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినంగా ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ ప్రాజెక్టులను తిలకించి ప్రశంసలు కురిపించారు. 9వ తరగతి విద్యార్థులు తయారు చేసిన సోలార్ ఎనర్జీతో పనిచేసే చెస్ మోటారు, తల్లి గర్భంలో మానవ పిండం పెరుగుదల, వాటర్ సైకిల్, ఎలక్ట్రిక్ సర్క్యూట్ సిరీస్ మెథడ్ వంటి ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వాటిని చూసేందుకు ఆసక్తి చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్సే మూలం..

డాబాగార్డెన్స్: ప్రపంచంలో సమస్త జీవరాశుల మనుగడకు సైన్సే మూలమని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్టు హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ బి. కోటేశ్వరరావు తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏవీఎన్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి సంపదను పరిరక్షించుకోవడం పౌరులందరి బాధ్యతని, సమస్త జీవరాశులు ఉన్నప్పుడే మానవాళికి మనుగడ ఉంటుందన్నారు. ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్, ఏయూ జియాలజీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. యుగంధర్, భౌతికశాస్త్ర ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశంలో సువిశాల సముద్ర తీరం ఉందని, మత్స్యసంపదతో పాటు సాగరతీరంలో ఉన్న ఇసుకలో ఎన్నో మినరల్స్ ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రసాయనశాస్త్రం విభాగాధిపతి కృష్ణకుమారి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి స్వరాజ్యలక్ష్మి, ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎస్. సంతోష్‌కుమార్, బోటనీ విభాగాధిపతి సంతోషి సత్య, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ అర్చన, ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

వుమెన్స్ కళాశాలలో..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, సెట్విస్ సీఈవో నాగేశ్వరరావు పాల్గొని సైన్స్ పట్ల అవగాహన, ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. కల్యాణరాము దైనందిన జీవితంలో సైన్స్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఏజీవో డాక్టర్ కె. సుధ, ఫిజిక్స్ విభాగాధిపతి రమ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, డాక్టర్ టి. వరలక్ష్మి, సంతోషి అనూష, డాక్టర్ ఎ. హైమావతి, సెట్విస్ ప్రతినిధి సూర్యప్రకాష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ పరస



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు మంథావారి వీధిలో వెలసిన పోలమాంబ 32వ పరస మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు కుంకుమ పూజలు, పుష్పాలంకరణ, సాయంత్రం అగ్నిగుండం, పులివేషాలు, తప్పెటగుళ్లు, తాడేపల్లిగూడెంచే కాంతార సెట్టింగ్, ఆర్కెస్ట్రా వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంథావారి వీధి, వార్డుభాయ్‌లేన్, కుమ్మరవీధి, తాడివీధి, పూర్ణామార్కెట్, రంగిరీజువీధి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉమామహేశ్వర ఆలయం, పోలమాంబ అమ్మవారి సేవా సంఘం ప్రతినిధులు, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దమరశింగు కనకారావు, కార్యదర్శి గుడివాడ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరగాని శంకరరావు, బంక వాసు, ఎన్ జనార్దన్, సాలపు నాయుడు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సున్నపు వీధిలో..

నగరంలోని టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల సున్నపు వీధిలో వెలసిన పోలమాంబ వార్షిక జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. సున్నపువీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, పంజాజంక్షన్ తదితర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అలయ కమిటీ చర్యలు చేపట్టింది.

'ఓటు అడిగే హక్కు బీజేపీకి మాత్రమే ఉంది'

డాబాగార్డెన్స్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఒక్క బీజేపీకి మాత్రమే ఉందని ఆ పార్టీ నుంచి బరిలో నిలిచిన పీవీఎన్ మాధవ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం అధిక శాతం నిధులు ఇచ్చిందన్నారు. రైల్వేజోన్, టీచర్స్‌కి టైమ్‌స్కేల్, విజయనగరంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి మంజూరు, రాష్ట్రంలో మెడికల్ కాలేజీ మంజూరు, పోలవరం మొదటి దశ పనులు, సింహాచలం దేవస్థానానికి ప్రసాదం పథకం కింద నిధుల మంజూరు చేసినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఈర్లె శ్రీరామమూర్తి బీజేపీలో చేరడంతో మరింత బలోపేతమైనట్లు తెలిపారు. సమావేశంలో ఈర్లె శ్రీరామమూర్తి, ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు జె. పృథ్వీరాజ్, రామకోటయ్య, మేడపాటి రవీంద్ర, సుహాసిని ఆనంద్, విజయానందరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నాగేంద్ర, సుబ్బరామిరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, పరశు రామరాజు, డీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం



విలియమ్స్ హూకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న టైలర్లు

మహారాణిపేట : ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా నగరంలో వేడుకలు నిర్వహించి, కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హూ చిత్రపటానికి దర్జీలంతా నివాళులు అర్పించారు. ది గ్రేటర్ విశాఖ టైలర్స్ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వై. గౌరీశంకర్, ఇమంది త్రినాథ్, డి. భాస్కరరావు, జయవర్ధని, కోన రమేష్, మోహన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర



అమ్మవారిని అభిషేకించేందుకు కలశాలతో వస్తున్న మహిళలు



పడగ ఎత్తి ఆడుతున్న పాము

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో పాటు కళా హాస్పిటల్ డాక్టర్ పైడి రమణమూర్తి, కళావతి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యవర్గ సభ్యులు వాసుపల్లి నారాయణ, బొడ్డు పోలారావు, కోశాధికారితో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలశాలతో భారీ ఊరేగింపు..

అచ్చియ్యమ్మపేట పోలేరమ్మ హుండీ వద్ద నుంచి పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని అభిషేకించేందుకు పసుపు, కుంకుమ, వేపకొమ్మలతో కూడిన కలశాలతో ఊరేగించారు. జెండా చెట్టువీధి, యాతపేట మీదుగా కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల అమ్మవారి దేవాలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకం చేశారు. కార్పొరేటర్ తోట పద్మావతి, డాక్టర్ పైడి రమణమూర్తి, కళావతి దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్, బొడ్డేటి ప్రసాద్, ఎం.రమేష్ పాల్గొన్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన నాగుల డ్యాన్స్, పోతురాజుల సందడి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి దేవాలయంతో పాటు అచ్చియ్యమ్మపేట వీధులన్నీ విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

నాగుపాము ప్రత్యక్షం

అల్లిపురం: రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయ వార్షిక జాతర మహోత్సవాల నేపథ్యంలో ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ అకస్మాత్తుగా తెల్లటి నాగుపాము భక్తులకు కనిపించి ఆశ్చర్యపరిచింది. దీంతో భక్తులు పాముకి నమస్కరించారు. కొందరు ఫొటోలు తీశారు. తరువాత కొద్ది సేపటికే పాము కనిపించకుండా పోయింది. దీంతో అమ్మవారే పాము రూపంలో వచ్చి దర్శనం కల్పించినట్లు భావించి పూజలు చేశారు.

సీతంరాజు గెలుపు కోరుతూ ప్రచారం



34వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, తోట పద్మావతి



ఓటు అభ్యర్థిస్తున్న కొప్పుల వెంకట్రావు

అల్లిపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి సభ్యుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయి ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో కలిసి కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, మనోరమా థియేటర్, కెప్టెన్ రామారావు జంక్షన్, డాల్ఫిన్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు, స్టిక్కర్లు అతికించి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీ గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ షరీఫ్, జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, 34వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, టర్నర్ చౌల్ట్రీ మాజీ చైర్మన్ లింగం శ్రీనివాసరావు, పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి లండా రమణ, దూడ అప్పారావు, మహిళా అధ్యక్షురాలు రాములమ్మ, దేవి, అశోక్, బొడ్డేటి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

36వ వార్డులో..

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపునకు 36వ వార్డులో ఆ వార్డు మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, వార్డు నాయకుడు కోరుకొండ సూర్యప్రసాద్ మంగళవారం వార్డు పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలంటూ దండుబజార్ ఎంపీడీ హైస్కూల్ ఉపాధ్యాయులను అభ్యర్థించారు. అలాగే వార్డు పరిధిలో పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ గ్రాడ్యుయేట్ ఓటర్లను అభ్యర్థించారు.

సీతంరాజుకు మద్దతు ఇవ్వండి

అల్లిపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్‌రావును కలిసి మద్దతు కోరారు. మంగళవారం ఆయనను అతని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కరపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ మూడు జిల్లాల్లో గల మానవ హక్కుల సంఘం కార్యకర్తల మద్దతు సీతంరాజు సుధాకర్‌కు ఉంటుందన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించడానికి తమ ప్రయత్నం చేస్తామని తెలిపారు.

సచివాలయ కన్వీనర్లతో సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొల్లి సింహాచలం, పార్టీ నాయకులు

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధి 36,38,39 వార్డుల్లో గల పలు సచివాలయాల కన్వీనర్లతో 39వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కొల్లి సింహాచలం మంగళవారం భేటీ అయ్యారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. బుధవారం నిర్వహించే పెన్షన్ పంపిణీలో కన్వీనర్లతో పాటు గృహ సారథులు కూడా పాల్గొనాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్, వార్డు మహిళా అధ్యక్షురాలు మాధురి, పార్టీ నాయకులు తిత్తి కృష్ణ, బాబ్జి, సలీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు

మురళీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం మహిళలకు నడక, క్విజ్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. నడకపోటీలను వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య ప్రారంభించారు. నడక పోటీలు ఐదు విభాగాలుగా నిర్వహించారు. మ్యూజికల్ చైర్, క్విజ్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 3వ తేదీన బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు



పతకాలు గెలుచుకున్న క్రీడాకారులను అభినందిస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: పలు అంశాల్లో సత్తా చాటిన క్రీడాకారులను 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అభినందించారు. ఆమె ప్రోత్సాహంతో మెలకువలు నేర్చుకున్న విద్యార్థులు ఇటీవల నేపాల్‌లో జరిగిన బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. బుల్లయ్య కాలేజీలో చదువుతున్న బి.మోహన్‌రాజ్ 63 కేజీల విభాగంలో బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. శ్రీ కాస్యప్ కాలేజీకి చెందిన ఎస్.భార్గవ్ 54 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. 75 కేజీల విభాగంలో సీహెచ్ దినేష్ సిల్వర్ మెడల్ సాధించాడు. ఏవీఎన్ కాలేజీకి చెందిన సీహెచ్ లోకేష్ అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. వీరికి క్రాంతి, డి.చిరంజీవి, డి.శ్రీను, డి.మురళీ, ఎం.మధు, డి.రవి సహకారం అందజేశారు. విజేతలను కార్పొరేటర్ అభినందించారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచాలి



బౌడారా రోడ్డులో మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: నగరంలో జి–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్–4 జెడ్సీ కె.శివప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన జోన్ పరిధి 12 వార్డుల్లో పర్యటించారు. బౌడారారోడ్డు రామకృష్ణ జంక్షన్‌లో ఉన్న యూజీడీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు. వార్డుల్లో రహదారులు, గెడ్డలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు యూజీడీలు ఎక్కడా లీక్ లేకుండా చూసుకోవాలన్నారు. రహదారులపై చెత్త లేకుండా చూసుకునే బాధ్యత సెక్రటరీలు, వార్డు ఇన్‌స్పెక్టర్లదే అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో ఎన్.కిశోర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

11న క్రైస్తవ ఆరాధకులతో గెట్ టుగెదర్

డాబాగార్డెన్స్: గొల్లలపాలెం ఐపీసీ చర్చిలో ఈ నెల 11న 500 మంది క్రైస్తవ ఆరాధకులతో గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలిండియా ఐక్య క్రైస్తవ జేఏసీ చైర్మన్ టి. బాబూరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు.

క్రైస్తవులకు రాజకీయాల్లో అవకాశం కల్పించాలని, క్రైస్తవులను సమాజంలో రాజకీయంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్‌గా ఎంఎల్‌ఏ/ఎమ్మెల్సీగా నామినేట్ చేసి క్రైస్తవ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పాస్టర్ శామ్యూల్, బాలరాజు, జార్జిబాబు, డేవిడ్ పాల్గొన్నారు.